‘ఏందుకు తింటంలేదు.... తింటానుగానీ కాస్తకంగారుగాతింటాను...... అంతే.....’రాంబాబు మాట్లాడుతున్నాడు గానీ అసలు తండ్రి తనని ఎందుకు పిలిపించాడో అని ఒక ప్రక్కన ఆలోచిస్తున్నాడు. పోనీ అడుగుదామంటే భయం!.... ఎక్కడ ఏ రకమైన బాంబు పేల్తుందోనని.

కానీ ఎంతసేపు ఈ టెన్షన్ ?

అందుకే ధైర్యం చేసి అడిగేశాడు.

‘నాన్నగారూ...నన్నసలు టెలిగ్రాం ఇచ్చి ఎందుకు పిలిపించారు?...’

‘నీకు పెళ్ళి చేద్దామని .... ఓ మాంచి సంబంధం వచ్చిందిలే.... ఆ వ్యవహారం ఏదో కుదుర్చుకుందామనీ....’ అన్నాడు పరంధామయ్య చుట్ట తిసి పెదాలమధ్య పెట్టి పళ్ళతో చివర్లు కొరికి ఊస్తూ.

రాంబాబు భయపడినంతా అయ్యింది..... ఇలంటి కొంపలు మునిగేదేదో నెత్తిమీదికి తెస్తాడని భయపడుతూనే వున్నాడు.

‘అయినా నాపెళ్ళికి ఇప్పుడేం కంగారు నాన్నా.....’ రాంబాబు తడి ఆరిపోయిన గొంతుతో అన్నాడు.

‘కంగారు నీకు లేకపోవచ్చుగానీ.... మాకు మాత్రం కంగారుగానే ఉంది....’ తాపీగా అగ్గిపెట్టె తీస్తూ అన్నాడు పరంధామయ్య.

‘నేను పెళ్ళి చేసుకోను నాన్నా!..... అయినా నాకప్పుడే పెళ్ళేంటి నాన్నా.....’

పరంధామయ్య రాంబాబువంక చురచురా చూశాడు.

‘నీకు ఏ వ్యవహారం ఎప్పుడు కావాలో నాకు తెలుసు. ఎల్లుండే పెళ్ళిచూపులు ఏర్పాటు చేశాం ..... పిల్లని చూద్దువుగాని.... పిల్ల నచ్చలేదని అన్నావో ..... మనిద్దరి మధ్యా వ్యవహారం చెడుతుంది.....’

చుట్టముట్టించి గుప్పుగుప్పున పోగవదిలాడు పరంధామయ్య.

‘మరి ఆ మాత్రం దానికి పెళ్ళిచూపులు కూడా ఎందుకూ?....’ ఏడుపు మొహంపెట్టి అన్నాడు రాంబాబు.

‘ఈ పెళ్ళిచూపుల వ్యవహారం నీకోసం కాదు ఏర్పాటు చేసింది.

ఆ అమ్మాయి నిన్ను చూడొద్దూ?....’ కోరకొరా రాంబాబుని చూస్తూ అన్నాడు పరంధామయ్య.

‘ఒకవేళ ఆ అమ్మాయికి నేను నచ్చకపోతేనో?....’ మనసులో ఏ మూలో ఆశ మినుకుమంటూంటే అడిగాడు రాంబాబు.

‘ఆ అమ్మాయి తండ్రికి మనతో సంబంధం కలుపుకోవాలని చాలా కోరికగా ఉంది..... ఎలాగోలా ఆ పిల్లని ఒప్పిస్తాడురా అబ్బాయ్.....’ అంది పార్వతమ్మ.

రాంబాబు రెండు చేతులతో తల గట్టిగా పట్టుకున్నాడు.

‘అబ్బా..... నాకు తల తిరుగుతుంది’ అన్నాడు బాధగా.

‘పట్నం వెళ్లేసరికి వీడికి చుట్టపొగ అలవాటు తప్పినట్టుంది......’ అన్నాడు పరంథామయ్య చుట్టపోగని మరో దిక్కుకి వదులుతూ.

## పెళ్ళిచూపులు

తెల్లారగానే చద్దన్నంలో మీగడ పెరుగేసుకుని ఆవకాయ్ ముక్క నంజుకుని ఫుల్ గా కొట్టే రాంబాబు ఇంటికి వచ్చాడు కిష్టయ్య.

‘గురూగారూ.... గురూగారూ.....’ గుమ్మంలోంచి గట్టిగా అరిచాడు కిష్టయ్య.

గొడ్లపాకలో గేదెలకి మేత వేస్తున్న పాలేరు రంగన్న కొడుకు గొంతు విని ఇవతలికి వచ్చాడు.

‘ఏంరోయ్.... పట్నం మెళ్ళాక షోకు బాగా పెరిగిపోయిందే! గురూ గారూ ఏందిరో చినబాబుగారూ అని పిలవలేవూ?....’ కొడుకుని మందలించాడు రంగన్న.

అప్పుడే బయటికి వచ్చిన రాంబాబు రంగన్నమాటలు విన్నాడు.

‘ఫరవాలేదు రంగన్నా ..... అవన్నీ పాత పద్దతులు.... నాకు బీదా ‘గురూగారూ’ అని లేక పేరుపెట్టి పిలిచిన నేనేమీ అనుకోను.... కావాలంటే నువ్వా మానాన్నగారిని గురూగారూఅని పిలుచుకో .....’ అన్నాడు రాంబాబు కిష్టయ్య భుజంమీద చెయ్యి వేస్తూ.

‘భలేవోరే.....ఈడి వ్యవహారం ఏం బాలేదని నన్ను పన్లోంచి తీసేడానికా బాబూ సలహా ఇస్తున్నావా?....’ అన్నాడు రంగన్న నవ్వుతూ.

రాంబాబు పేలవంగా నవ్వాడు. రాంబాబు నవ్వులో తేడా కనిపించింది కిష్టయ్యకి. ఏదో అడగబోయాడు. అంతలో రాంబాబు అన్నాడు. ‘పదా ..... అలా పొలాల్లోకి వెళదాం.... నీతో ముఖ్యమైన విషయం చెప్పాలి!.....’

ఇద్దరూ ఊరిచివర ఉన్న పొలాల్లోకి వెళ్లి గురించి చెప్పాడు కిష్టయ్యతో.

‘ఇంతకీ అమ్మాయి ఎవరండీ?....’ కిష్టయ్య అడిగాడు.

‘ఏమో .... నాకేం ఇంటరెస్టు ఉందని ఆ వివరాలన్ని అడుగుతాను’ అన్నాడు రాంబాబు దీనంగా.

‘నేను చేసుకోనుగాక చేసోను అని చెప్పెయ్యండి.....’

‘అదేం కుదరదు..... నీకు మానాన్న గురించి తెలుసుగా.....’

‘లేదా మీరు వాళ్ళకి నచ్చనట్టు ప్రవర్తించాలి పెళ్ళిచూపుల్లో.....’

‘అదీ లాభంలేదు .... పెళ్ళికుతురు తండ్రికి మాతో సంబంధం చాలా మోజుగా ఉందిట.....!!

‘ఏదో ఆలోచించాలి గురూగారూ.....’

‘ఆలోచించు.... ఆలోచించు..... ఎలాగైనా సరే నువ్వీ పెళ్ళి తప్పిస్తే నీకు వయసొచ్చేక

మంచి అమ్మాయిని చూసి నా ఖర్చులతో నీకు పెళ్ళి జరిపిస్తా.....'

'అంటే నాకు ఇంకా వయసురాలేదనా గురూగారు మీఉద్దేశం?.....' కిష్టయ్య కొంటెగా అడిగాడు.

అటువంటి బ్లూ ముడ్లో కూడా రాంబాబుకి నవ్వొచ్చింది.

ఆ మర్నాడు.....

సాయంత్రం.....

పెళ్ళి చూపులకు బయలుదేరాడు రాంబాబు, అతని కూడా తల్లీదండ్రీ, చెల్లెలూ, కిష్టయ్య కూడా వున్నారు. వీళ్లని గుమ్మంలోంచే రిసీవ్ చేసుకున్నారు అమ్మాయి తల్లిదండ్రులు వర్ధనమ్మ, రాఘవేంద్రరావులు. అమ్మాయి అన్నయ్య శ్రీనివాసరావు 'రండి బావగారూ రండి.....' అంటూ రాంబాబు చేయి పట్టుకుని లోపలికి తీస్కెళ్ళాడు.

అందరూ హాల్లో కూర్చున్నారు. కాస్సేపు కాబోయే వియ్యంకులిద్దరూ ఆ మాటా ఈ మాటా మాట్లాడుకున్నారు. కాబోయే వియ్యపురాళ్ళిద్దరూ ఒకరి మెడలోనివి మరొకరు పరీక్షించుకున్నారు.

రాంబాబు మాత్రం తల వొంచుకుని కూర్చున్నాడు.

'అబ్బాయికి బాగా సిగ్గనుకుంటాను.....' అన్నాడు రాఘవేంద్రరావు.

'అబ్బే .... సిగ్గా బొందా? ఈ హాల్లో ఫ్లోరింగులో బండలు ఎన్ని ఉన్నాయో లెక్కచూస్తున్నాడు..... వాడి వ్యవహారమే అంత .....' అన్నాడు పరంధామయ్య.

పార్వతమ్మ, పరంధామయ్య, రాంబాబు, కిష్టయ్య ఒక సోఫాలో ఇదే వరుసలో కూర్చున్నారు.

ఇంతలో టిఫిన్లు వచ్చాయ్.

రాంబాబు ఇంకా తల వంచుకునే ఉన్నాడు. అతని ముందు వున్న టిపాయ్ మీద ఒక గాజుల చేయి టిఫిన్ పెట్టింది.

'చెయ్యి బాగుంది!.....' అనుకున్నాడు రాంబాబు.

'మీరు చేసుకోకపోతే పోయారుగానీ ఒకసారి అమ్మాయి ముఖంవేపు చూడండి.....' కిష్టయ్య రాంబాబు చెవిలో గుసగుసలాడాడు.

రాంబాబు మెల్లగా తలెత్తి చూశాడు.

ఆ అమ్మాయి పార్వతమ్మ ముందు టిఫిన్ ప్లేటు ఉంచుతుంది.

'అమ్మాయి బాగుంది కదూ' రాంబాబు కిష్టయ్య చెవిలో గుస గుస లాడాడు.

'ఛ.... సరోజకి నే నెందుకు అన్యాయం చేస్తానూ?.....' రాంబాబు మళ్ళీ కిష్టయ్య చెవిలో గుసగుసలాడాడు.

వీళ్ళిద్దరి సంగతీ గమనించిన వర్ధనమ్మ అంది.

'అది మా పని పిల్ల నాయనా.... కాస్త షోకులెక్కువ దానికి ..... చేతికి గోరింటాకు,

చేతినిండా గాజులు, తలనిండా పూలూ ఉంటే తప్పదానికి పనిచెయ్యబుద్ధి కాదు.'

రాంబాబు కిష్టయ్యలు నాలుకలు కొరుక్కున్నారు.

'చవట పీనుగా.....' పరంధామయ్య రాంబాబు చెవిలో తిట్టాడు.

అందరూ టిఫిన్లు తినడం ప్రారంభించారు. రాంబాబు అందరివంకా మొగమాటంగా చూడసాగాడు.

'ఏంటండి గురూగారూ.... అలా దిక్కులు చూస్తారేం..... తినండి .....' అన్నాడు కిష్టయ్య రాంబాబు చెవిలో.

నేను వీళ్ల అమ్మాయిని చేసుకోవడం లేదు కదా.... మరి టిఫెన్ తింటే బావుంటుందంటావా ?' కిష్టయ్య చెవిలో మెల్లగా గొణిగాడు.

వర్ధనమ్మకి ఏదో అనుమానం వచ్చింది.

'ఒసేవ్ రంగీ ..... నువ్విక్కడ నుండి పోయి లోపలి పని చూస్కో.....' అంది. రంగి వెళ్ళిపోయింది.

'పరవాలేదు గురూగారూ.... అని తిన్నంత మాత్రాన మీరు చేసుకోవాలని ఏంలేదు.... లోకంలో ఎంతమంది పెళ్ళికొడుకులు ఎన్ని ఇళ్ళల్లో తీనేసి మీ అమ్మాయి నాకు నచ్చలేదు అంటం లేదు?....' కిష్టయ్య మళ్లీ రాంబాబు చెవిలో గొణిగాడు.

రాంబాబు తన ముందున్న ప్లేటు లోంచి కాజా తీసి కొరికాడు.

టిఫిన్లు తినడం కాఫీ తాగడం అయిపోయింది.

'ఇంక అమ్మాయిని తీసుకురండి.....' అన్నాడు రాఘవేంద్రరావు వర్ధనమ్మతో. వర్ధనమ్మ లోపలకి వెళ్ళింది.

ఒక రెండు నిముషాల తరువాత వర్ధనమ్మ అమ్మాయిని తీసుకువచ్చింది.

ఆ అమ్మాయిని చూస్తూనే రాంబాబు, కిష్టయ్య అసంకల్పితంగా 'కెవ్వు' మని కేకేశారు.

## *ఫ్రేమ్ - 19*

### *నాగరాజుకి భంగపాటు!*

ఆ రోజు ఆదివారం

కాలేజి లేని కారణంగా సరోజ తీరుబడిగా తన పుస్తకాల షెల్ఫు సర్దసాగింది. అది అయిపోయాక "బట్టలు కూడా సర్దుకోవాలి!..... బీరువా అంతా కంగాళీగా ఉంది .....' అనుకుంది సరోజ.

బీరువా సర్దుతుడగా అంతలో ఆమెకి నికాన్ కెమేరా కనిపించింది..... నీలిమ గుర్తుగా తనవద్ద పడివున్న కెమేరా.....

ఆ కెమేరాని చూస్తూనే సరోజ మనసు వికలమైది. నీటిపొర ఆమె కళ్లని కప్పింది.

పైట కొంగుతో కన్నీళ్ళు అద్దుకోని కెమేరాని చేతిలోకి తీసుకుంది. ఇన్ని రోజులు గమనించలేదుగానీ అప్పుడు గమనించింది.... కెమేరా లోడ్ చేసి ఉంది!

ఇంకా మూడు స్నాప్స్ మిగిలి ఉన్నాయి.

'ఏం చేస్తున్నావే?.....'

వెనక్కి తిరిగి చూసింది సరోజ. గది గుమ్మం దగ్గర లక్ష్మి నిలబడి ఉంది.

'ఏయ్! రావే ..... ఏంటి పొద్దున్నే ఇటువచ్చావ్! .....' అంది సరోజ మంచంమిద కూర్చుంటూ--

ఇంట్లో బోర్ కొడ్తుందే ..... అందుకనే వచ్చాను ..... నువ్వొస్తే మార్నింగ్ షోకి వెళ్దామనీ ......' అంది లక్ష్మి సరోజ పక్కన కూర్చుంటూ.

'ఈవేళ వొద్దే..... ఇల్లంతా సర్చుకోవాలి..... పోనీ సాయంత్రం ఫస్టు షోకి వెళదాం.....' అంది సరోజ నికాన్ కెమేరాని అటూ ఇటు తిప్పి చూస్తూ.

'ఈ కెమేరా ఎక్కడిదే ?' అడిగింది లక్ష్మి.

సరోజ చెప్పింది.

'నీలిమకి ఫోటోగ్రఫి అంటే చాల ఇష్టం!

ఈ మధ్యనే ఫోటోగ్రఫీకి సంబంధించిన విషయాలు కొద్దికొద్దిగా తెలుసుకుంటూ ఉంది..... బహుశా ఇందులో మంచి మంచి స్నాప్స్ ఉండి ఉండాలి!!'

లక్ష్మి సరోజ చేతిలోంచి ఆ కెమేరా తీసుకుని చుసింది.

'ఇంకా మూడు స్నాప్స్ మిగిలాయే....' అంది సరోజతో.

'మనం ఇద్దరం ఆ మూడు ఫోటోలూ తీయించుకుని రీలు కడగడానికి ఇద్దాం'

సరోజ అన్నయ్య భీమేశ్వరరావుని పిలుచుకుని వచ్చిది.

గదిలోకి అడుగుపెట్టిన భీమేశ్వరరావు లక్ష్మిని చూసి ఓసారి తన బనీను వంక చూసుకుని కెవ్వున మనసులో కేకేస్కుని 'ఇప్పుడే వస్తాను.....' అని నిమిషం తరువాత చొక్కా వేసుకుని వచ్చాడు.

'కండలు తిరిగిన మగాళ్ళు ఆడాళ్ళలా సిగ్గుపడితే గమ్మత్తుగా ఉంటుంది' అనుకుంది లక్ష్మి.

చెల్లెల్ని , లక్ష్మిని మూడు యాంగిల్స్ లో ఫోటోలు తీసాడు భీమేశ్వరరావు.

'ఇంక నే వెళ్ళనా ?.... ప్రాక్టీసు చేస్కోవాలి!!'

చెల్లెల్ని అడిగాడు భీమేశ్వరరావు కండల్ని పరిశీలనగా చూస్కుంటూ.

సరోజ కెమేరా అందుకుని తలూపింది. భీమేశ్వరరావు వెళ్ళి పోయాడు.

సాయంత్రం ఈ రీలు రాంబాబుకి ఇచ్చి అట్నుంచి అటు సినిమాకి వెళదాం' అంది సరోజ లక్ష్మితో.

'అన్నట్టు నీ హీరో రాంబాబు ఏమంటున్నాడు?

సరోజ బుగ్గగిల్లుతూ అడిగింది. లక్ష్మి.

సరోజ ముసిముసిగా నవ్వుతూ  మూడు రోజుల క్రితం తాము పార్కుకి వెళ్లడం అక్కడ తమ ప్రేమని ఎక్స్ ప్రెస్ చేసుకోవడం పెళ్ళి చేసుకోవాలని నిర్ణయించుకోవడం అన్నీ వివరంగా లక్ష్మికి చెప్పింది.

'మరి ఈ విషయాన్ని ఇంత ఆలస్యంగాన చెప్పడం .... అయితే త్వరలో పప్పన్నం పెట్టిస్తున్నావన్నమాట!!.....'

'బావని వదిలించుకున్నాను గానీ రాంబాబుతో నా పెళ్ళికి మానాన్నని ఒప్పించగలిగా?..... రాంబాబు రెండు రోజుల్నుండీ కనబడలేదు. కనీసం ఫోన్ కూడా చేయలేదు.... ఎందుకో మరి?.....'

'పెళ్ళికొడుకు సిగ్గుపడ్తున్నాడేమో ?....'

సరోజ నవ్వింది.

'మన దగ్గర ఈ సిగ్గులూ  బొగ్గులూ జాన్తానై .... పెళ్లయ్యాక అన్ని సిగ్గుతో ఎగరగొట్టేస్తా......'

లక్ష్మి విరగబడి నవ్వింది.

లక్ష్మి సాయంత్రం దాకా సరోజ దగ్గరే ఉండిపోయింది. ఇద్దరూ కలిసి ఇల్లు సర్దుకున్నారు.

సాయంత్రం నాలుగు అవ్వస్తుండగా నాగరాజు వచ్చాడు.

హాల్లోనే రాజశేఖరం తగిలాడు.

'ఏం మావయ్యా..... బాగున్నావా?' అంటూ పలకరించాడు నాగరాజు.

సోఫాలో కూర్చుని ఇలస్ట్రేటెడ్ వీక్లీ తిరగేస్తున్న రాజశేఖరం తల ఎత్తి చూడకుండానే సమాధానం చెప్పాడు. 'ఆ ..... బాగానే ఉన్నాం.....' ప్రస్తుతం బాగానే ఉన్నాం..... తరువాత భవిష్యత్తులో కూడా బాగానే ఉంటాం..... దిక్కుమాలిన రంగులు బయటపడ్డాయిగా?....'

నాగరాజుకి ఆయన ఏమన్నాడో అర్థం కాలేదు. ఇంతలో రామయ్య అక్కడికి పరుగెత్తుకు వచ్చాడు.

'అదేంటి బాబూ అలా నిలబడ్డారు......కూర్చోండి బాబూ..... మీరు కూర్చోవాలి బాబూ.....ప్లీజ్‌బాబూ.... కూర్చండి బాబూ... కాళ్ళు లాగుతాయ్ బాబూ.....'

'ఏంటి రంగులు బయట పడ్డాయని అంటున్నావు?' అడిగాడు నాగరాజు.

'కూర్చోవాలి!..... లేకపోతే కాళ్ళు లాగేస్తాయ్ బాబూ.....'

'నీకు తెలిదా?.... దిక్కుమాలిన నటనా నువ్వు.....'

'ప్లీజ్ బాబూ..... కూర్చోండి.....'

'నాకా?..... నువ్వు దేని గురించి అడుగుతున్నావు అసలు అర్థం అయితేగా.....'

'కూర్చోరా ?.... కూర్చోండి బాబూ ..... మా ఇంటికి వచ్చినాళ్ళు నిలబడకూడదు.....'